**Mahilala Shrama Dopidi**

# మహిళల శ్రమ దోపిడీ

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (Regd.)**
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-2. ఫోన్:040-24564583

**Mahilala Shrama Dopidi**

***Source :*** **Islameeya Udyamam- Mahilalu** ***(Telugu)***


**TIP Series No. : 352**

Writer : Syed Sadatullah Hussaini

Translator : Batool Humairvi


*All Rights Reserved with Publishers*


1st Edition : Sept. 2023

Copies : 1000

**Price : Rs.30**

Published by : **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phones: **9490627650**
24576237, 24564583
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# పెట్టుబడిదారీ విధానం : మహిళల దోపిడీ

ప్రపంచంలోని బడుగు బలహీన వర్గాలన్నీ సామ్రాజ్యవాద దోపిడీకి గురవుతున్నాయి. తన స్వప్రయోజనాల కోసం బలహీన వర్గాల దోపిడీకి పాల్పడడం సామ్రాజ్యవాద అసలు నైజం. ఆర్థిక లాభాలను ఆర్జించి సంపదను పోగు చేసేందుకే సామ్రాజ్యవాదం ఈ తరహా దోపిడీకి పాల్పడుతుంది.

ప్రపంచవ్యాప్త పేద దేశాలు, ఆదివాసీలు, గ్రామీణ నిరుపేద ప్రజలు వెనుకబడిన తదితర వర్గాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాద దోపిడీకి గురయ్యే వారిలో మరో ప్రధానమైన వర్గం మహిళా వర్గం. ధనార్జనే ధ్యేయంగా పెట్టుబడిదారీ వర్గం మహిళలపై పలు విధాల దౌర్జన్యాలకు పాల్పడుతోంది. వారిపై రెండు మూడు రెట్ల పని భారాన్ని మోపి, వారి భౌతిక, మానసిక అవసరాలను సైతం లెక్కచేయకుండా యంత్రాల మాదిరిగా వారితో పని చేయిస్తోంది. స్త్రీల అందచందాలను అంగడిలో అమ్మకానికి పెట్టి మహిళల లైంగిక దోపిడీకి పాల్పడుతోంది. తన ఉత్పత్తుల అమ్మకాల కోసం స్త్రీల శారీరక అవయవాలతో సొమ్ము చేసుకుంటోంది.

ప్రాచీన సమాజాలలో స్త్రీ ఎంత అణచివేతకు గురైందో, నేటి ఆధునిక సామ్రాజ్యవాద సమాజాలలో అంతకన్నా ఎక్కువ అణచివేతకు గురవుతుందంటే అతిశయోక్తి కాదేమో.. అక్కడ కూడా ఆమెకు అత్యల్ప జీవన ప్రమాణాలే లభించాయి. ఇక్కడ కూడా అత్యున్నత ప్రమాణాల వూసే లేదు. అక్కడ అనాగరిక, సామాజిక దురాచారాలకు బలైతే, ఇక్కడ ఆధునిక సాంస్కృతిక ప్రమాణాల ముందు మోకరిల్లాల్సిన పరిస్థితి. అక్కడ అణచివేతలకు నిశ్శబ్దంగా నలిగిపోతే ఇక్కడ

మానసిక దోపిడీకి గురవుతున్నప్పటికీ ప్రతిఘటించలేని నిస్సహాయ స్థితి!

సోషలిస్టులు ఇతర ఉద్యమాలు సమాజంలో అణగారిన వర్గాల (గ్రామీణ నిరుపేదలు, ఆదివాసీల) అభ్యున్నతికై పని చేస్తున్నప్పటికీ వారిలో మహిళల నిజమైన శ్రేయోభిలాషులు లేరనే చెప్పాలి. మహిళల దోపిడీలో సామ్రాజ్యవాదులు సోషలిస్టులు ఇద్దరూ సమానమే. ఇక మహిళా అభ్యున్నతికై పాటుపడే మహిళా ఉద్యమాలను గమనిస్తే ఈ దోపిడీ ద్వారాలను సుగమం చేసేవారిలో అన్నిటికన్నా ముందు వారే ఉంటారంటే ఆశ్చర్యపడనవసరం లేదు. వాస్తవమేమంటే ఇస్లాం ఛత్రఛాయల్లోనే స్త్రీకి రక్షణ లభించింది. భవిష్యత్తులో కూడా మహిళలకు ముక్తిదాయక మార్గమేదైనా ఉంటే అది కేవలం ఇస్లాం మాత్రమేనని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## కెరీరిజం, పని ఒత్తిడి, మానసిక దోపిడీ

ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థకు తన సేవలకై తక్కువ జీతాలపై పని చేసే ఉద్యోగుల ఓ పెద్ద సమూహం అవసరం ఏర్పడింది. కనుక అది మీడియా ద్వారా Career Woman అనే మహిళా దృక్పథాన్ని తెరపైకి తెచ్చింది. ఫలితంగా కుటుంబం, కుటుంబ జీవన విలువలు భ్రష్టుపట్టాయి. వివాహ వ్యవస్థ వ్యర్థమని ప్రకటించింది. వివాహం లేకుండానే Live in Relationship, Casual Sex లాంటి సంప్రదాయాలను ప్రోత్సహించింది. తద్వారా కుటుంబ బాధ్యత, పిల్లల పోషణా భారం లేకుండా నిత్యం మహిళా లోకం తన ప్రయోజనాలకై అందుబాటులో ఉండాలనేది దాని ఉద్దేశ్యం.

ఐటీ కంపెనీలు, కాల్ సెంటర్లు బిపిఓ ఇండస్ట్రీలలో కింది స్థాయి ఉద్యోగాలలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలనే విధానం అమల్లో ఉంది. దానికి కారణం మహిళలు పురుషుల కన్నా ఎక్కువసేపు స్థిమితంగా కూర్చొని పని చేయగలరని హెచ్ఆర్ మేనేజర్లు చెప్పుకొస్తారు. ఎక్కువసేపు పనిచేయడం, ఎక్కువ విధేయత కలిగి ఉండడం, తక్కువ జీతాలపై పని చేయడం తక్కువ సెలవులు తీసుకోవడం లాంటి కారణాలవల్ల ITES కంపెనీలలో జూనియర్ స్థాయిలో మొత్తం ఉద్యోగుల్లో సగానికన్నా ఎక్కువ మహిళా ఉద్యోగినులే ఉన్నారు. కాల్ సెంటర్లలో వారి సంఖ్య 35 శాతం కన్నా ఎక్కువే.

గ్లోబలైజేషన్ యుగానికి చెందిన ఈ కంపెనీలు మహిళల అవసరాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ముందు నుంచే కాల్ సెంటర్లలో మహిళలు నైట్ షిఫ్టులలో రాత్రంతా కష్టపడి పని చేయాల్సిన పరిస్థితి. 2007లో వచ్చిన సుప్రీంకోర్టు తీర్పు, ఫ్యాక్టరీ యాక్టులో ప్రతిపాదిత సవరణల ప్రకారం, ఉన్న ఆ కొంత వెసులుబాటు కూడా లేకుండా పోయింది. ఇక్కడ వారి ప్రత్యేక అవసరాలను పరిగణనలోకి తీసుకోకపోవడమే గాక, ప్రెగ్నెన్సీ సమయంలో సెలవులకు సంబంధించి కూడా వారిపై ఎన్నో ఆంక్షలు ఉంటాయి. ఎటువంటి ప్రైవసీ ఏర్పాటు ఉండదు. రాత్రంతా మేల్కొని పని చేసే మహిళల్లో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాక వారి నెలవారి వ్యవస్థ అస్తవ్యస్త మవుతుంది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నైట్ షిఫ్టుల్లో పనిచేసే మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం అధికంగా ఉంటుందని తన నివేదికలో పేర్కొంది.

అంతేగాక పురుషులతో పోల్చితే నైట్ షిఫ్టులలో పనిచేసే మహిళల్లో నిద్రలేమి, అలసట, లైంగిక సామర్థ్యం తగ్గిపోవడం, హృద్రోగాలు, Metabolic Disorders జీవక్రియకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి.

మహిళలు రాత్రంతా పురుషుల మధ్య కూర్చొని పలు రకాల ఇబ్బందులకు గురవటమే కాక, ఒకే సమయంలో వారు తమ పనిలో ప్రామాణికతను చూపుతూనే మరోవైపు పురుష పుంగవులైన ఉద్యోగులనూ సంతృప్తి పరచాల్సి ఉంటుంది. టైమ్స్ ఆఫ్ ఇండియా ఈ పరిస్థితిపై వ్యాఖ్యానిస్తూ ఓ చక్కటి విషయాన్ని రాసింది. ఆధునిక కంపెనీలు ఓ మహిళా ఉద్యోగిని ద్వారా ఈ విధానాన్ని ఆశిస్తున్నాయి...

"Look like a women, behave like a lady, think like a man and work like a dog" (Times of India : 2-8-1993)

ఆమె తన అందచందాలతో పురుషులను మైమరిపించాలి. అదే సమయంలో ఆమె ఒక గౌరవప్రదమైన మహిళగా మనగలగాలి. పురుషుని తరహా ఆలోచించాలి, కుక్కల మాదిరిగా పని చేయాలి.

దురదృష్టకర విషయమేమంటే దోపిడికి గురయ్యే ఈ మహిళలకు తమ సమస్యల పరిష్కారం కోసం అన్యాయానికి వ్యతిరేకంగా గళమెత్తే అవకాశాలు కూడా దక్కడం లేదు. మల్టీ నేషనల్ కంపెనీలు భారతదేశ పరిధిలో పని చేసినప్పటికీ

దేశ శిక్షాస్మృతి ప్రకారం ఉద్యోగులకు యూనియన్లు ఏర్పరచు కునేందుకు, తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాటం చేసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. ఫ్యాక్టరీస్‌యాక్టు, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టులోని ఎన్నో అధికరణల నుండి వారికి మినహాయింపు ఉంది.

కేవలం పగటిపూట పనిచేసే మల్టీ నేషనల్ కంపెనీలు కూడా రాత్రి 11, 12 గంటల వరకు పని చేసేందుకు వారిని ఇబ్బంది పెడుతున్నాయి. 8 గంటల నిర్ణీత వ్యవధిలో పని పూర్తి చేయడం సాధ్యం కానటువంటి టార్గెట్లు ఇస్తాయి. ప్రాజెక్టు పూర్తయ్యే రోజుల్లోనైతే ఒక్కొక్కసారి రాత్రంతా ఆఫీసులోనే ఉండాల్సిన పరిస్థితి. నైట్ షిఫ్టు కంపెనీలలో కనీసం మహిళలకు రక్షణా ఏర్పాట్లు ఉంటాయి. కానీ పగటిపూట పనిచేసే కంపెనీలలో కనీస సౌకర్యాలు కూడా ఉండవు. ఒక్కోసారి ఒకే అమ్మాయి అనేక మంది పురుషులతో కలిసి ఆఫీసులో రాత్రంతా పనిచేయాల్సి వస్తుంది. ప్రభుత్వం ఈ కంపెనీలపై భారతదేశ లేబర్ చట్టాలను కూడా అమలు చేయడం లేదు.

ఈ కంపెనీలలో మహిళలు తరచూ తమ పైఅధికారులు, తోటి ఉద్యోగుల నుంచి లైంగిక వేధింపులను ఎదుర్కోవాల్సి వస్తుంది. గత కొన్నేళ్లలో బిపిఓ, కాల్ సెంటర్లలో పనిచేసే అనేక మంది మహిళా ఉద్యోగినులపై అత్యాచారం జరిపి హత్యలు చేసిన సంఘటనలు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించాయి. తెల్లవారుజామున బెంగుళూరులో తానియా బెనర్జీ అనే మహిళ అదే ఆఫీసులో పనిచేసే ఉద్యోగి ద్వారా అత్యాచారానికి గురై హత్యకు గురవడం (Times of India , Bangalore 27th July 2006) హెచ్పీ ఉద్యోగి ప్రతిభా మూర్తి తన కారు డ్రైవర్ ద్వారా హత్యగావింపబడడం (Times of India : 19-12-2005), ఢిల్లీలో ఒకదాని తర్వాత మరోటి జరిగే ఇలాంటి ఎన్నో సంఘటనలు పరిస్థితి గంభీరతను అర్థం చేసుకునేందుకు దోహదపడతాయి.

లైంగిక అత్యాచారం, ఆపై హత్య లాంటి కిరాతక ఘాతుకాలకు సంబంధించిన కొన్ని సంఘటనలు మాత్రమే వెలుగులోకి వస్తాయి. ఇక లైంగిక వేధింపులు మానభంగాల సంఘటనలు ఎన్నో చోట్ల సర్వసాధారణ విషయంగా మారాయి.

కళాశాల విద్య పూర్తి చేసుకున్న నవ యువతీ యువకులకు బిపివో, కాల్ సెంటర్లలో ఉద్యోగాలు లభిస్తాయి. వయసులో ఉన్న ఆ యువకులను రాత్రంతా

అలంకారప్రాయమైన అర్ధనగ్న దుస్తులు ధరించిన అమ్మాయిలతో పాటు కూర్చోబెట్టడం జరుగుతుంది. ఆ అమ్మాయిలను కాల్ సెంటర్లలో అందమైన స్వరంలో ఎదుటివారి మనసును ఆకట్టుకునే విధంగా మాట్లాడేందుకు ప్రత్యేక మైన శిక్షణనిస్తారు. (కొన్ని కాల్ సెంటర్లలో అమెరికన్ కస్టమర్ల కామతృష్ణను తీర్చేందుకు ఆ అమ్మాయిలను అశ్లీల సంభాషణ జరిపే తర్ఫీదును సైతం ఇవ్వడం జరుగుతుంది.) ఆ తరువాత రాత్రంతా వాళ్ళు అమెరికా నలుమూలల నుండి వచ్చే కాల్స్‌ను అందుకునేందుకు ఎంతో ఒత్తిడితో కూడుకున్న పనిలో నిమగ్నమై ఉండాల్సి వస్తుంది. అటువంటి వాతావరణంలో లైంగిక భావాలు అదుపు తప్పడం అసాధారణ విషయమేమీ కాదు.

ఫిబ్రవరి 2006లో చేసిన ఒక అధ్యయనం ప్రకారం నోయిడాకు చెందిన ఓ కాల్ సెంటర్లో 11 శాతం మహిళా ఉద్యోగినులు ఐదుగురి కన్నా ఎక్కువ మంది పురుషులతో తాము లైంగిక సంబంధాలు నెరిపినట్లు చెప్పుకొచ్చారు. (www.theviewspaper.net/hiv-aids-and-Indian-youth).

ఈ ఉద్యోగుల్లో వైల్డ్ పార్టీ (Wild parties)ల సంప్రదాయం కూడా ఎక్కువే. ఈ పార్టీలలో ఒకే రాత్రి అమ్మాయిలు అబ్బాయిలు అనేక విభిన్న భాగస్వాములతో భిన్నమైన లైంగిక చర్యల్లో పాల్గొంటారు. ముంబైలోని కాల్ సెంటర్లలో పని చేసే ఉద్యోగుల్లో జరిపిన ఒక సర్వే ప్రకారం 89% మంది ఉద్యోగులు ఇటువంటి పార్టీలలో తరచూ పాల్గొంటారనే విషయం తెలిసింది (The Telegraph, Calcutta, May 14, 2006). బాత్రూములు కండోమ్లతో నిండిపోయిన కారణంగా తరచూ వాటిని శుభ్రం చేయడానికి పిలుస్తారని పెద్ద కంపెనీలలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు చెప్పుకొచ్చారు (Banglore Mirror, 27th January 2009).

కాల్ సెంటర్లు, బిపిఓ ఎయిడ్స్ లాంటి ప్రాణాంతక మహమ్మారి వ్యాప్తికి మూలం కావచ్చని వాల్ స్ట్రీట్ జర్నల్ హెచ్చరించింది. సామ్రాజ్యవాదం తన స్వప్రయో జనాల కోసం మన దేశంలో వ్యాపింపజేస్తున్న సంస్కృతిలో ఈ విశృంఖల వ్యసనా లన్నీ అంతర్భాగమయ్యాయి. అన్నిచోట్లా, ముఖ్యంగా మనదేశంలో స్త్రీలకు ఇన్ని కష్టాల తర్వాత కూడా సంపాదించే దాని మీద ఎటువంటి హక్కూ లేదు. డాక్టర్ ప్రమీలా కపూర్ పరిశోధన ప్రకారం ఉన్నత, మధ్య తరగతి వర్గాలలో సంపాదించే మహిళల ఆదాయంపై వారికి ఎటువంటి హక్కూ ఉండదు. ఆమె

సంపాదనంతా తన భర్త, అత్తమామలకు అప్పగించాల్సిందే. ఆఫీసు సమస్యలు దాంతో పాటు కుటుంబ సమస్యలనూ ఎదుర్కోవాలి. ఆపైన వారి నడవడికపై అస్తమానం అనుమానపు వలయాలు విస్తరిస్తూనే ఉంటాయి.

ప్రమీలా కపూర్ ఓ లేడీ డాక్టర్ గురించి చెప్పుకొస్తూ ఆమె భర్త తన రోజు వారీ ఖర్చుల కోసం ఆమె ఆదాయంలో నుండి కేవలం రెండు రూపాయలు ఇచ్చేవాడని వివరించింది.

పని భారం, పెరుగుతున్న పరస్పర సంఘర్షణలతో మహిళలు మానసిక వ్యాధులకు గురవుతున్నారు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవం సందర్భంగా అసోచామ్ సంస్థ (Associated Chambars of Commerce and Industry of India) (ఇది మన దేశంలోని అతి పెద్ద వాణిజ్య పారిశ్రామిక సంస్థ) ఓ ప్రత్యేక నివేదికను ప్రచురించింది. ఈ నివేదిక ప్రకారం నగరాలలో కార్పొరేట్ కంపెనీలలో పనిచేస్తున్న స్త్రీలలో 68% మంది జీవనశైలికి (Lifestyle Related Diseases) సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ అధ్యయనం ప్రకారం పని ఒత్తిడి, సుదీర్ఘ పని షెడ్యూలు, టార్గెట్లు, డెడ్‌లైన్లు పెట్టి పని చేయించే కంపెనీలలో 75% కన్నా ఎక్కువ మంది మహిళలు డిప్రెషన్ బారిన పడుతున్నట్లు వెల్లడైంది. మీడియా, కె.పి.ఓ (KPO)లో పనిచేసే మహిళలు అనారోగ్యానికి గురైతే సెలవులు దొరకటం కూడా కష్టమేనని నివేదిక పేర్కొంది. పని ఒత్తిడి, ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేసే ప్రయత్నంలో 53% మహిళలు మధ్యాహ్న భోజనం కూడా సరిగ్గా చేయలేరు. వ్యాధిగ్రస్తుల్లో 77 శాతం మహిళలు వైద్యుల వద్దకు కూడా వెళ్లలేని పరిస్థితి.

అసోచామ్ నివేదిక ఓ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది.

**"కార్పొరేట్ మహిళా ఉద్యోగులు ఇంటా బయటా తమ బాధ్యతలను నిర్వర్తించడంలో సమతౌల్యాన్ని పాటించే క్రమంలో సమయం సహకరించక వ్యక్తిగత సామాజిక అవసరాలలో సమతౌల్యాన్ని పాటించే క్రమంలో జరిగే సంఘర్షణాత్మక వాతావరణం వారికి తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసేలా చేస్తుంది".** Nusrat Ahmed Study on, "Preventive Health Care and Corporate Female Workforce" Assocham Research Bureau, New Delhi, 2009

సైకియాట్రిస్టు షీలా దీతారాయ్ అధ్యయనం ప్రకారం పట్టణ మహిళల్లో నిద్రలేమి సమస్య పెరుగుతోంది. ఐటీ, కస్టమర్ కేర్, హెచ్ ఆర్ లాంటి ఒత్తిడితో కూడుకున్న వృత్తుల పట్ల నిబద్ధత పెరగడంతో మహిళల్లో పురుషుల కన్నా నిద్రలేమి ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఉంది. కలకత్తాలో పని చేసే మహిళల్లో గత పదేళ్లలో ఈ సమస్య 5 శాతం పెరిగింది *(Ajanta Chakraborthy, "Long Days, Longer..." Times of India 8th September 2009)*.

టైమ్స్ ఆఫ్ ఇండియా ఈ మహిళల దారుణమైన స్థితిని ఈ విధంగా చిత్రించింది.

"రోజంతా సుదీర్ఘమైన పనితో అలసిపోయి పడుకునేందుకు పక్క మీదకు వెళుతుంది, గంటల తరబడి సీలింగ్ వైపు చూస్తూ ఉంటుంది. టిక్ టిక్ మంటూ గడియారపు శబ్దం, ఎయిర్ కండిషన్ నుండి వచ్చే మందపాటి శబ్దం మరింత బాధాకరంగా మారుతుంది. అర్ధరాత్రి తరువాత చేసేదేమీ లేక నిద్ర మాత్రలు వేసుకుని నిద్రకు ఉపక్రమిస్తుంది. ఈ మాత్రల ప్రభావం వల్ల మగత మొదలవడం, అంతలోనే మళ్ళీ అలారం మోగడం ఆరంభిస్తుంది.... మళ్లీ ఒత్తిడితో కూడిన రోజు, ఆపై మరో నిద్ర లేని రాత్రి, ఈ విధమైన పరంపర కొనసాగుతూనే ఉంటుంది".

ఓ వైపు మానసిక సమస్యలతో సతమతమవుతూనే మరోవైపు ఈ మహిళలు మత్తు పదార్థాలను ఆశ్రయించాల్సిన దయనీయమైన స్థితికి చేరుకుంటున్నారు. ఐక్యరాజ్యసమితి సర్వే ప్రకారం భారతదేశ పట్టణ ప్రాంతాల్లోని మహిళల్లో డ్రగ్స్ వినియోగం పెరుగుతోంది. 20 నుండి 30 సంవత్సరాల మధ్య వయసు గల ఈ మహిళలు డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఆల్కహాల్‌తో పాటు హెరాయిన్, Propoxyphene Tranquilizers లాంటి ప్రమాదకర డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. హెరాయిన్ వాడకం న్యూఢిల్లీలోని మహిళల్లో అధికంగా ఉందని నివేదిక పేర్కొంది. చెన్నై లాంటి సాంప్రదాయిక నగరాల్లో కూడా మహిళలు ఈ డ్రగ్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. నివేదిక ప్రకారం ఇక్కడి మహిళల్లో డ్రగ్స్ వినియోగం ఆర్థికంగా ఉన్నత సామాజిక వర్గాల్లో ఉందనే విషయం వెల్లడైంది. పైన పేర్కొన్న డ్రగ్స్ కాకుండా ఉన్నత విద్యావంతులు, సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందిన మహిళలు మత్తుకోసం Alprozolam, Diazapam వంటి డ్రగ్స్‌ను ఉపయోగిస్తున్నట్లు కనుగొన్నారు.

## మహిళలను అంగడిబొమ్మగా చేసి, అంగాంగాలను అంగడి వస్తువులుగా మార్చడం *(Commodification of Female Body)*

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్త్రీకి స్వచ్ఛత పవిత్రతను ప్రసాదించాడు. అయితే పెట్టుబడిదారీ విధానం ఆమె అందచందాలను తన వ్యాపారాభివృద్ధి కోసం అంగడి వస్తువుగా మార్చేసింది.

ఈ నీచమైన క్రీడలో సామ్రాజ్యవాదానికి సహాయమందించే అతి పెద్ద సాధనం మీడియానే. వార్తాపత్రికలు, టీవీ ఇంటర్నెట్ సినిమాలు ఇలా ఒకటేమిటి ప్రతీ చోటా స్త్రీ ఒకే రూపంలో కనిపిస్తోంది. అందాల ఆటబొమ్మ వినోద వస్తువు... స్త్రీ శరీరం వినోదాన్నిచ్చే ఓ ఆట బొమ్మలాంటిది. ఆమె అంగాంగాలను అలంకారంగా మార్చి అత్యంత నగ్నంగా ప్రదర్శనా వస్తువుగా చేసి, అన్ని రకాల ఉత్పత్తుల ప్రచారానికి అమ్మకానికి ఉపయోగించడం జరుగుతుంది. ఒక అందమైన రిసెప్షనిస్టు ఆఫీసు అంతర్గత అలంకారంలో భాగమై ఉంటుంది. పర్సనల్ సెక్రటరీలుగా ఉన్న మగువలను ముద్దాడడం కూడా కార్పొరేట్ పార్టీల మర్యాదలో అంతర్భాగమే. మహిళల చిత్రాలు లేనిదే ఏ ప్రకటనా పరిపూర్తి కాదంటే సందేహపడాల్సిన అవసరం లేదు. స్త్రీ అమెరికా స్టేట్ సెక్రటరీ అయినా ఆమె శరీరాకృతి, ధరించే దుస్తులు, ముఖవర్ఛస్సే గమనించదగిన అసలు విషయాలు.

గత కొద్ది సంవత్సరాల క్రితం అమెరికా అధ్యక్షుడు ఒబామా భార్య మిషల్ ఒబామా, హిల్లరీ క్లింటన్ దుస్తులు, వారి అందచందాలు ప్రపంచవ్యాప్తంగా వార్తాపత్రికలలో చర్చనీయాంశమయ్యాయి. అంటే స్త్రీ ఎంత ఉన్నత శిఖరాలకు చేరినా ఈ శృంగార పూరిత సమాజంలో ఆమె ఒక అందమైన ఆట బొమ్మ లాంటిదే అనే విషయం బోధపడుతుంది.

అంతే కాకుండా స్త్రీలకు నిర్మొహమాటంగా శృంగార బిరుదులు ఇవ్వబడ తాయి. విషయం మరింత ముందుకుపోయి విశృంఖలత్వానికి అలవాటైన మహిళలపై అశ్లీల పదబంధాలను ఉపయోగించే అలవాటును నాగరిక ప్రపంచమంతా అవలంబించింది. సెక్సీ, బింబోస్, హాస్ (Sexy, bimbos, hos) (ఒక విధమైన బూతు) లాంటి పదబంధాలు ఆధునిక విద్యావంతులైన అమ్మాయిల కోసం

కూడా మన దేశ వార్తా పత్రికల్లో అలవోకగా ప్రయోగిస్తున్నారు. 1999లో మహిళల ఫుట్బాల్ ఛాంపియన్ అమెరికన్ టీమ్ చిత్రాలతో పాటు అమెరికా వార్తాపత్రికలు బూటర్స్ విత్ హూటర్స్ ("booters with hooters") అనే లేబుల్ పెట్టాయి. ఆరేళ్ల చిన్నారి టీ షర్టుపై లిటిల్ హాటీ ("little hottie") అని రాసి ఉంది.

స్త్రీ శరీర అంగాంగాలను మార్కెట్ వస్తువుగా చేసే పరమ జుగుప్సాకరమైన ప్రక్రియ ప్రపంచ పోర్నోగ్రఫీ పరిశ్రమలో ప్రముఖంగా కనిపిస్తోంది. పోర్నోగ్రఫీ (అశ్లీల సాహిత్యం, అశ్లీల చిత్రాలు, వీడియోలు సినిమాలు లాంటివి) పెట్టుబడిదారులకు ఆర్థికంగా లాభం చేకూర్చే అతి పెద్ద మార్గం. కేవలం పోర్నోగ్రఫీ ద్వారా అమెరికా, జపాన్, సౌత్ కొరియాలు 60 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ లాభాలు గడిస్తాయి (www. internet-filter-review. topten-reviews.com/internet-pornography-statistics. html#time). పోర్నోగ్రఫీపై కేవలం ఒక సెకన్కు మూడు లక్షల డాలర్లు వెచ్చించబడతాయి. దీనికోసం దాదాపు 42 లక్షల వెబ్సైట్లు వాటికి సంబంధించిన 42కోట్ల పేజీలు పని చేస్తున్నాయి (www.internet-filter-review. topten- reviews.com/ internet-pornography-statistics.html# time). అమెరికన్లు పోర్నోగ్రఫీపై ఏటా 4 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తారు. అమెరికాలో అమ్మకానికి పెట్టే అశ్లీలకరమైన నవలలు 11,000 పైగానే ఉన్నాయి (Office of the Attorney General, 2006 usdoj.gov./ Ag/ annual reports/tr 2005/agreporthuman trafficking.2005. pdf).

పోర్నోగ్రఫీ పరిశ్రమను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిపరిచేందుకు నగ్నత్వానికి, అశ్లీలానికి సంబంధించిన నైతిక దృక్పథాలు మారాయి. నగ్నత్వాన్ని ఒక సహజ స్థితి (Natural State)గా పేర్కొనడం జరిగింది (York Times, 27-4-08 Shirts, No Worries, New No shoes, No). పుట్టుకతో దిగంబరంగా నివసించే వ్యక్తుల కుటుంబాలు, క్లబ్బులు పబ్బులు, ఎయిర్ లైన్స్, హోటళ్ళు, వినోద స్థలాలు లాంటివి ఉనికిలోకి వచ్చాయి. వారికి ప్రకృతి ప్రేమికులనే (Naturist) మర్యాదపూర్వక పేరు ఇవ్వబడింది. అనేక దేశాల చట్టాల్లో మార్పులు తీసుకొచ్చారు. కనుకనే అత్యంత నిస్సిగ్గుగా సామ్రాజ్యవాదం స్త్రీ అంగాంగాలను తన వ్యాపార ప్రయోజనాల కోసం వాడుకుంటోంది.

## ఇస్లాం వైఖరి

ఇస్లాం ప్రతీ రంగంలో సమన్యాయానికి పెద్దపీట వేస్తుంది. దాని ఆదేశాలు జీవితంలోని ప్రతి రంగంలోనూ దుర్మార్గం దౌర్జన్యాల వటవృక్షాలను సమూలచ్ఛేదం చేస్తాయి. మహిళలకు సంబంధించి కూడా ఇస్లామీయ షరియా సూత్రాలు సమన్యాయం సమతుల్యతా వైఖరికి ప్రతీకలుగా నిలుస్తాయి. సామ్రాజ్యవాద దుర్మార్గాలకు ఊతమిచ్చే సకల మార్గాలను మూసివేస్తాయి. ఇస్లాం మహిళల వ్యక్తిత్వం, వారి స్త్రీత్వాన్ని గుర్తించి వారికి సగౌరవ మర్యాదలు ప్రసాదించింది. స్త్రీ సహజత్వాన్ని అంగీకరిస్తూనే ఆమెకు తగిన విధంగా సర్వ హక్కులూ ప్రసాదించింది. కనుక ఒక ముస్లిం మహిళ సోకాల్డ్ లింగ సమానత్వ నినాదాలకు ఎన్నడూ మోసపోదు.

## మహిళల కెరీర్, ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించి

ఇస్లాం స్త్రీకి తన విద్యాబుద్ధులు ప్రతిభా పాటవాల కనుగుణంగా సామాజిక సాంస్కృతిక సేవలందించే అనుమతినిచ్చింది. మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లం) కాలంలోనూ అనేకమంది మహిళామణులు వివిధ ఆర్థిక కార్యకలాపాలు కొనసాగించేవారు. ఆర్థిక అవసరాలే కాకుండా, తన ప్రజ్ఞా పాటవాలు సమయ సంపదలను సద్వినియోగం చేసుకునేందుకు, సామాజిక సేవలందించేందుకు తన ఆదాయాన్ని మెరుగుపరుచుకునేందుకు అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టేందుకు కూడా మన ఉలమాలు పండితులు స్త్రీకి ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనేందుకు అనుమతినిచ్చారు.

## స్త్రీపై ఎలాంటి ఆర్థిక భారం లేదు

సామ్రాజ్యవాదం తన స్వప్రయోజనాల కొరకు మహిళా లోకానికి స్వయం సమృద్ధి సాధించే స్వప్నాలను చూపింది. ఫలితంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆమెను సాధికారి చేయగలవని నమ్మబలికింది. ఇస్లాం దృష్టిలో ఈ విధమైన ఆలోచన సరాసరి తప్పు. పరస్పర సహాయ సహకారాలు ప్రేమానురాగాలే కుటుంబానికి పునాది అని ఇస్లాం పేర్కొంటుంది. ఇంటి బాధ్యతల్లో పని విభజన రీత్యా సూత్రప్రాయంగా స్త్రీకి కుటుంబ సంరక్షణా బాధ్యతలను అప్పగించింది. స్త్రీకి ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేందుకు కేవలం అనుమతి ఉందే తప్ప ఆమెపై ఎలాంటి ఆర్థిక భారం

**లేదు. కుటుంబ ఆర్థిక భారాల సంపూర్ణ బాధ్యత పురుషునిదే. భార్య ఖర్చులు భరించాల్సిన బాధ్యత కూడా అతనిపైనే ఉంటుంది.**

**పురుషులు స్త్రీలకు అధికారులు ఎందుకంటే అల్లాహ్ వారిలో ఒకరికి మరొకరిపై ఆధిక్యతలను ప్రసాదించడం వల్ల, ఇంకా పురుషులు తమ సంపదను వారి కొరకు ఖర్చు చేస్తున్నందువల్ల. *(అన్ నిసా : 34)***

**అప్పుడు ఆమెకు పిల్లల తండ్రి తగు రీతిగా భోజన వస్త్రాలను ఇచ్చి పోషించ వలసి ఉంటుంది. *(అల్ బఖర: 234)***

స్త్రీల పట్ల మీపై గల హక్కు ఏమిటంటే అత్యుత్తమమైన రీతిలో వారికి అన్న వస్త్రాలు సమకూర్చండి. *(ముస్లిం, జాబిర్ బిన్ అబ్దుల్లాహ్).*

ఒకవేళ భర్త లేకపోతే (వితంతువు లేక విడాకులు పొందిన స్త్రీ) ఇస్లాం స్త్రీ పోషణా బాధ్యతలు తండ్రికి అప్పగిస్తుంది. అసలు పోషించే వారు ఎవరూ లేకపోయి నట్లయితే ఆమె పోషణా బాధ్యత ప్రభుత్వానిదే.

స్త్రీ సంపాదిస్తున్నట్లయితే ఆమెకు తన సంపాదనపై సంపూర్ణాధికారాలు ఉంటాయి. భర్త, మెట్టినింటి బంధువులు స్త్రీని ఆర్థిక కార్యకలాపాలకై బలవంతం చేయలేరు. సంపాదించే మహిళకు ఆమె ఆదాయాన్ని ఇచ్చేందుకు బలవంత పెట్టనూలేరు. స్త్రీకి తన ఆదాయంపై సర్వ హక్కు భుక్తములు ఉంటాయి. అయినప్పటికీ సంపాదించే మహిళ ఖర్చులు ఆమె భర్తే భరించాల్సి ఉంటుంది..

**అల్లాహ్ మీలో ఎవరికైనా ఇతరులకు ఇచ్చిన దానికంటే ఎక్కువగా ప్రసాదించి ఉంటే మీరు దానికి ఆశపడకండి. పురుషులు సంపాదించిన దానికి తగినట్లుగా వారి భాగం ఉంటుంది. స్త్రీలు సంపాదించిన దానికి తగినట్లుగా వారి భాగం ఉంటుంది. అయితే అల్లాహ్‌ను ఆయన అనుగ్రహం కొరకు ప్రార్థిస్తూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ సకల విషయ పరిజ్ఞానం కలవాడు (అన్ నిసా: 32).**

ఈ విధమైన ఇస్లామీయ వైఖరి స్త్రీ జీవనోపాధి లేక ఆర్థిక కార్యకలాపాలను కేవలం ఆమె ఆసక్తి, సామాజిక సేవలకే పరిమితం చేస్తుంది. సాధారణ పరిస్థితుల్లో స్త్రీ ఎటువంటి ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనదు. ఉపాధిరంగంలో అడుగిడినా తనను తాను బిజీగా ఉంచుకోవటానికో లేక తన కళాభిరుచులను సంతృప్తి

పరచుకోవడానికో తన విద్యాబుద్ధులను సద్వినియోగపరచుకోవడానికో లేదా ఏదైనా ఓ పెద్ద సాంస్కృతిక సామాజిక అవసరాన్ని నెరవేర్చడానికో ఉద్యోగం చేస్తుంది తప్ప ఈ పని ఆమె బాధ్యతల్లో చేర్చబడలేదు. కనుక దానికోసం ఆమెకు ఒత్తిడిని భరించాల్సిన అవసరం లేదు. ఇబ్బంది పడాల్సిన అవసరమూ లేదు. ఒకవేళ ఆమె పరిస్థితులు పని చేసే చోట వాతావరణం అనుకూలించి, ఈ వృత్తి ఆమెకు ఒక ఆహ్లాదకరమైన వ్యాపకంగా ఉండి దాంతోపాటు ఆమె కుటుంబ బాధ్యతలు ధార్మిక అవసరాలను సులభంగా నెరవేర్చడం సుసాధ్యమైతే తనే స్వతహాగా ఓ నిర్ణయం తీసుకుని తన భర్త అనుమతితో ఈ విధమైన వృత్తిని కొనసాగించవచ్చు. దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని తనపై తన తల్లిదండ్రులు బంధుమిత్రులు నిరుపేదలపై అల్లాహ్ మార్గంలో లేదా తన ఇష్టానుసారంగా తన భర్త పిల్లల అవసరార్థం ఖర్చు పెట్టవచ్చు. అయితే గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే ఈ వ్యవహారమంతా ఆమె ఇష్టాఇష్టాలపైనే ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా స్త్రీ కొరకు ఉపాధి రంగం ఒక స్వచ్ఛంద సేవగా మిగిలి పోతుంది. ఆమె ఎప్పుడు కావాలంటే అప్పుడు దాన్ని నిర్వర్తించవచ్చు. తన అసలు బాధ్యతలకు ఆటంకం కలిగినప్పుడు, అది తన సుఖశాంతులకు, కుటుంబ జీవితానికి నష్టంగా పరిణమించినప్పుడు దాన్ని వదిలి వేయనూవచ్చు. ఇస్లాం చూపే ఈ విధమైన మధ్యే మార్గ వైఖరి సంప్రదాయ సమాజాల మాదిరిగా స్త్రీని ఇంటి నాలుగ్గోడలకు పరిమితమూ చేయదు, అలా అని ఆమె సామర్థ్యా లను వృధా చేసే అవకాశమూ ఇవ్వదు. ఆధునిక సామ్రాజ్యవాద సమాజాల మాదిరిగా ఆమెపై అదనపు భారాన్ని మోపి ఆమె ఆరోగ్యం శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కారకమూ కాజాలదు.

## ఇల్లాలి అసలు బాధ్యత ఇల్లే

స్త్రీ కార్య పరిధి ఇల్లేననీ, దైవం ముందు జవాబు దారీకి తగిన బాధ్యత కూడా ఆమె గృహ నిర్వహణే అనీ ఇస్లాం చాటి చెబుతోంది. కనుక ఆమె తన మొదటి ప్రాధాన్యత ఇంటికే ఇవ్వాల్సి ఉంటుంది.

## స్త్రీ తన భర్త కొరకు సుఖప్రదాయిని

**ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీ కొరకు జంటలను మీ జాతిలో నుండే సృష్టించాడు. మీరు వారి వద్ద శాంతిని పొందడానికి మీ మధ్య ప్రేమను కారుణ్యాన్ని సృజించాడు. నిశ్చయంగా ఆలోచనా పరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి.** ***(అల్ రూమ్:21)***

ఇంకా తన భర్త, తన ఇల్లు పిల్లల గురించి అల్లాహ్ ముందు జవాబుదారీగా ఉంటుంది.

మీలో ప్రతి ఒక్కరూ బాధ్యుడే. తన బాధ్యత గురించి జవాబుదారుడే. స్త్రీ తన భర్త తన ఇల్లు, పిల్లల బాధ్యురాలు. *(బుఖారీ, ఇబ్నె ఉమర్ ఉల్లేఖనం)*

ఒంటెల స్వారీ చేసే (అరబ్బు) స్త్రీలలో అందరికన్నా ఉత్తమమైన మహిళలు ఖురైష్‌కు చెందిన సత్యవతులైన స్త్రీలే. ఎందుకంటే వారు తమ చిన్నపిల్లలపై ప్రేమ వాత్సల్యాలను చూపిస్తారు తమ భర్త వ్యవహారాల పట్ల సంరక్షణ వహిస్తారు. *(బుఖారీ, అబూహురైరా)*

## *ఆర్థిక కార్యకలాపాల కొరకు షరతులతో కూడిన అనుమతి ఉంది*

పై బాధ్యతలను నెరవేర్చుతూ ఒకవేళ స్త్రీ ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనదలిస్తే దానికి ఆమెకు అనుమతి ఉంది కానీ ఈ అనుమతి కొన్ని షరతులతో కూడినది. వాటిలో కొన్ని ముఖ్యమైన షరతులు చర్చనీయాంశమైనవి.

(అ) ఆమె పరాయి పురుషుల ముందు పరదా లేకుండా వెళ్ళకూడదు. వారి ముందు వెళ్ళేటప్పుడు ఆమె ఇస్లామీయ ఆదేశాల ప్రకారం గౌరవప్రదమైన దుస్తులు ధరించి హిజాబ్ పాటించాల్సి ఉంటుంది.

**'ప్రవక్తా! విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు! తమ చూపులను కాపాడుకోండి అని, తమ మర్మాంగాలను రక్షించుకోండి అని, తమ అలంకరణను ప్రదర్శించ కూడదని: దానంతటఅదే కనిపించేది తప్ప'.** ***(అన్ నూర్: 31)***

**ప్రవక్తా! మీ భార్యలకు నీ కూతుళ్ళకు విశ్వాసుల యొక్క స్త్రీలకు తమ దుప్పట్ల కొంగులను తమపై వేలాడ తీసుకోమని చెప్పు, వారు గుర్తింపబడడానికి వేధింప**

**బడకుండా ఉండేందుకూ ఇది ఎంతో సముచితమైన పద్ధతి. అల్లాహ్ క్షమించే వాడు, కరుణించేవాడూను.** ***(అల్ అహ్జాబ్ : 59)***

(ఆ) మాట్లాడేటప్పుడు సంభాషణలో హుందాతనం ఉండాలి. అనైతిక మార్గానికి దారి తీసేటటువంటి అసభ్యకరమైన సంభాషణలు చెయ్యకుండా జాగ్రత్త పడాలి.

**ఓ ప్రవక్త భార్యలారా! మీరు సాధారణ స్త్రీల వంటి వారు కారు. మీరు అల్లాహ్‌కు భయపడేవారు అయితే సుతిమెత్తని శైలిలో మాట్లాడకండి. ఎందుకంటే దుష్ట మనస్సు గల వ్యక్తి ఎవడైనా వ్యామోహపడవచ్చు కాబట్టి ప్రఖ్యాత పద్ధతిలో మాట్లాడండి.** ***(అల్ అహ్జాబ్:32)***

(ఇ) పరాయి పురుషునితో పాటు ఏకాంతంలో ఉండకూడదు. (బుఖారి)

ఏ వ్యక్తీ మరే స్త్రీతో పాటు ఆమె మహ్రం (దగ్గరి బంధువు) లేకుండా ఏకాంతంలో కూర్చోకూడదు.

మహాప్రవక్త(స) ప్రవచించారు : ఇద్దరు స్త్రీ పురుషులు ఏకాంతంలో ఉన్నప్పుడు వారితో పాటు మూడో వ్యక్తి షైతాన్ ఉంటాడు. *(హదీస్)*

## అశ్లీలత, విశృంఖలత్వానికి సంబంధించి

అశ్లీలం విశృంఖలత చరిత్రలోని ప్రతీ కాలంలో పెట్టుబడిదారుల ప్రధాన ఆయుధంగా ఉంది. Sex sales వ్యాపారం వారి ప్రధాన సూత్రం. కనుక ఇస్లాం అశ్లీలతను రూపుమాపేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టింది. దాన్ని సుగమం చేసే సకల మార్గాలనూ మూసివేసింది. సమ్మతి ఉన్నా లేకపోయినా, వ్యాపార వాణిజ్య ప్రయోజనాల కోసం జరిపేటటువంటి అన్ని విధాలా వివాహేతర లైంగిక కార్యకలాపాలను నిషేధించడమేగాక ఈ చర్యను శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తూ దానికోసం తీవ్రమైన శిక్షలను ఖరారు చేసింది. దాని ప్రేరణకు దోహదపడే అన్ని మార్గాలకూ అడ్డుకట్ట వేసింది.

కేవలం వ్యభిచారం మాత్రమే కాదు. బూతు సాహిత్యం, బూతు చిత్రాలు, బూతు సంభాషణలు, బూతు ఆలోచనలు అన్ని విధాల అశ్లీల విషయాలు ఇస్లాంలో అత్యంత పకడ్బందీగా నిషేధింపబడ్డాయి.

**న్యాయం చేయండి అనీ, ఉపకారం చేయండి అనీ, బంధువుల హక్కులు నెరవేర్చండి అనీ అల్లాహ్ ఆజ్ఞాపిస్తున్నాడు. చెడును, అశ్లీలతను, అన్యాయాన్ని, మితిమీరి ప్రవర్తించడాన్ని నిషేధిస్తున్నాడు. ఆయన మీకు హితబోధ చేస్తున్నాడు, మీరు గుణపాఠం నేర్చుకోవాలని.** ***(అన్ నహ్ల్: 90)***

**ప్రవక్తా! వారితో ఇలా అను, "నా ప్రభువు నిషేధించినవి ఇవి: సిగ్గుమాలిన పనులు–బహిరంగమైనవి కాని, లేక గుప్తమైనవి కాని– పాపాలు సత్యానికి వ్యతిరేకంగా మేర మీరడం, అల్లాహ్ ఏ ప్రమాణాన్ని అవతరింప జేయకపోయినా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా కల్పించడం (వాస్తవంగా అల్లాహ్‌యే అన్నాడని) మీకు తెలియని విషయాన్ని మీరు అల్లాహ్ పేరుతో చెప్పడం".** ***(అల్ ఆరాఫ్: 33)***

**ప్రవక్తా! వారికి ఇలా చెప్పు: "రండి మీకు వినిపిస్తాను, మీ ప్రభువు మీపై విధించిన కట్టుబాట్లు ఏమిటో, ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చెయ్యరాదు. తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి. పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తు న్నాము వారికీ ఇస్తాము. అశ్లీల విషయాల దరిదాపులకు కూడా పోకండి బహిరంగమైనవైనా సరే లేక గోప్య మైనవైనా సరే.** ***(అల్ అన్ఆమ్:151)***

ఇస్లాం అశ్లీల ద్వారాలను ఎంత కట్టుదిట్టంగా మూసివేస్తుందో దాని అంచనా ఈ హదీసుతో వేసుకోవచ్చు ప్రవక్త (స) ఇలా ప్రవచించారు :

చూపు కంటి వ్యభిచారం, మాట నోటి వ్యభిచారం, హృదయ వ్యభిచారం ఏమంటే అది వాంఛిస్తుంది. మర్మాంగాలు దాని తృష్ణను తీరుస్తాయి లేక తిరస్కరిస్తాయి. (బుఖారి, అబూహురైరా)

చూపుల నిషేధం కేవలం ప్రత్యక్షంగానే కాదు, పరోక్షంగా చూసే ఫోటోలు చిత్రాలు వీడియోలు వెబ్ కాన్ఫరెన్స్ లాంటివి కూడా ఆ కోవలోకే వస్తాయి. ఒక మహిళ అందాన్ని, ఆమె అంతర్గత సౌందర్యాన్ని కళ్ళకు కట్టినట్టుగా వివరణాత్మకంగా వర్ణించడాన్ని సైతం ఇస్లాం ఇష్టపడదు.

"ఏ స్త్రీ ఇతర స్త్రీల రూపురేఖలను తన భర్త ముందు అతను చూస్తున్న మాదిరిగా వర్ణించకూడదు". *(బుఖారి, అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్)*

అశ్లీలతను వ్యాపింపజేసేటటువంటి ఎలాంటి వ్యాపారాన్నయినా ఇస్లాం అనుమతించదు. వ్యాపార ప్రకటనలు లేదా మరే ఇతర మార్గాల ద్వారానయినా ప్రజల మధ్య అశ్లీలతను వ్యాపింపజేసేటటువంటి వ్యక్తికి వ్యధాభరితమైన శిక్ష ఉంటుందని దివ్య ఖురాన్ హెచ్చరిస్తుంది.

**విశ్వాసుల వర్గంలో అశ్లీలత వ్యాపించాలని కోరేవారు ప్రపంచంలోను పరలోకంలోనూ వ్యధాభరితమైన శిక్షకు అర్హులు. అల్లాహ్ ఎరుగును మీరు ఎరుగరు.**
***(అన్ నూర్:19)***

పోర్నోగ్రఫీ, దానికి సంబంధించిన సకల వ్యాపారాలూ నిషిద్ధమే. అందులో ఎటువంటి లావాదేవీలు కానీ, ఏ విధమైన సహకారం కానీ నిషిద్ధమే. ఈ విధమైన వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టబడిన కంపెనీ వాటాను కొనుగోలు చేయడం కూడా హరామ్. ఒక ముస్లిం ఇంటర్నెట్ కేఫ్ నడుపుతున్నప్పటికీ అతను తన కేఫ్‌లో ఎటువంటి తప్పుడు సైట్లు చూడబడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

ప్రవక్త(స) ప్రవచనం ఈ విధంగా ఉంది :
"అల్లాహ్ ఏదైనా వస్తువును నిషేధిస్తే దాని వెలను ఇచ్చిపుచ్చుకోవడాన్ని కూడా నిషేధిస్తాడు". *(అహ్మద్, అబూ దావూద్)*

ఈ విధంగా ఇస్లాం వ్యభిచార వాణిజ్య కొనుగోలుదారులు, పెట్టుబడి దారులు, సహవర్తకులు అందరి మార్గాలకు అడ్డుకట్ట వేసింది. ముస్లిం సమాజంలో వ్యభిచారం ఒక్క నిమిషమైనా మనజాలదు.

## వస్తు వినిమయానికి సంబంధించి

నిరాడంబరత్వం ఉన్నతమైన ఆలోచనలు, ఉత్తమమైన నడవడి ఇస్లామీయ జీవన విధానం.

దైవప్రవక్త(స) ప్రవచించారు-

"సాదాసీదాగా జీవించడం విశ్వాసి లక్షణాలలో ఒకటి". *(అబూదావూద్, ఉమామా బిన్ సాలబా)*

ఇంకా ఈ విధంగా సెలవిచ్చారు :
"ప్రాపంచిక విలాసాలు నాకు వద్దు. సేదతీరేందుకు కొద్దిసేపు చెట్టు నీడలో ఆగి మళ్లీ ప్రయాణం చేసేటటువంటి ఓ బాటసారి లాంటి వాడను మాత్రమే నేను" *(తిర్మిజీ, ఇబ్నె మస్ఊద్).*

మరో హదీసులో ఇలా ఉంది :
ఒక పరుపు పురుషుని కొరకు, రెండవది అతని భార్య కొరకు, మూడవది అతిథి కొరకు, నాలుగవ పరుపు షైతానుది *(బుఖారి, జాబిర్).*

ఇస్లాంలో వనరుల వినియోగంలో సమతుల్యతను పాటించమనీ అవసరానికి అధికంగా ఉన్న వనరులను నిరుపేదలలో పంపిణీ చేయమని నిర్దేశించబడింది.

**తినండి, త్రాగండి, మితిమీరకండి. అల్లాహ్ మితిమీరేవారిని ప్రేమించడు.**
***(అల్ ఆరాఫ్: 31)***

వనరులు ఎక్కువగా ఉంటే దుబారాకు పాల్పడకుండా వాటిని అవసరార్థులపై ఖర్చు పెట్టాలని ఖురాన్ ఆదేశిస్తుంది.

**బంధువుల పట్ల మీ విధులను నిర్వహించండి. పేదవారి పట్ల, బాటసారుల పట్ల, మీ విధులను నిర్వర్తించండి. వృధా ఖర్చు చేయకండి. వృధా ఖర్చు చేసేవారు షైతాను సోదరులు. షైతాను తన ప్రభువుకు కృతఘ్నుడు.** ***(బనీ ఇస్రాయిల్: 26, 27)***

మేము అల్లాహ్ మార్గంలో ఏమి ఖర్చు పెట్టాలి? అని వారు అడుగుతారు. మీ నిత్యావసరాలకు పోగా మిగిలినది అని నీవు వారికి చెప్పు. *(అల్ బఖర:219)*

మహాప్రవక్త ముహమ్మద్ (స) బోధించారు :

"షైతానులకు చెందిన కొన్ని ఒంటెలు ఉంటాయి. అలాగే కొన్ని నివాసాలు కూడా. మీలో ఒక వ్యక్తి సవారి చెయ్యని ఒంటెలు తీసుకుని వెళ్లడం నేను చూశాను. అతను వాటిని బాగా తినిపించి బలీయమైనవిగా చేశాడు. అందులోని ఏ ఒంటెపైనా తను ఎక్కడు. తన సోదరుణ్ణీ ఎక్కించడు". *(అబూదావూద్, అబూహురైరా)*

**అల్లాహ్ ఈ ఆదేశాలను పాటిస్తే ప్రస్తుతం పెట్టుబడిదారీ విధానం మన మహిళల్లో**

**జొప్పించిన జీవన ప్రమాణాలు విలాస వైభోగాల వెంట పరుగులంకించే ఫలితంగా ఏర్పడే ఉద్రిక్త పరిణామాలకు ఆస్కారం ఎంత మాత్రము ఉండదు.**

ఒక ముస్లిముకి  అల్లాహ్ మార్గంలో ఖర్చు పెడుతూ ప్రజా ప్రయోజక పనులు చేసే ఆరాటం ఉండాలే తప్ప దుబారా ఖర్చులు ఆర్భాటపు షాపింగుల వ్యసనంలో కూరుకుపోవడం కన్నా అవివేకం మరేముంటుంది?

